సాక్షి
కర్నూలు
శుక్రవారం, 15, డిసెంబర్, 2023



నీటి విడుదల నిలిపివేత

గూడూరు: సుంకేసుల రిజర్వాయర్‌కు ఇన్‌ఫ్లో నిలిచి పోయింది. దీంతో కేసీ కాల్వకు నీటి విడుదల నిలిపివేశారు. ప్రస్తుతం డ్యాంలో 1.194 టీఎంసీల నీరు నిల్వ ఉంది.



శ్రీమఠంలో భక్తుల సందడి

మంత్రాలయం: శ్రీరాఘవేంద్రస్వామి మఠంలో గురువారం భక్తుల సందడి నెలకొంది. భక్తులు రాఘవేంద్రుల మూలబృందావనాన్ని, గ్రామదేవత మంచాలమ్మను దర్శించుకున్నారు.



పాదరక్ష.. బతుకు దీక్ష

చెప్పల తయారీ పరిశ్రమగా మారడంతో చర్మకారుల పరిస్థితి దుర్భరంగా మారింది. అయితే కొందరు ఇప్పటికీ రోడ్ల పక్కనే చెప్పలు కుడుతూ జీవనం సాగిస్తున్నారు. 10లో▸

న్యూస్‌రీల్

పంట ఉత్పత్తులకు ఆశాజనకంగా ధరలు

కర్నూలు(అగ్రికల్చర్): స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో వివిధ పంట ఉత్పత్తులకు ధరలు ఆశాజనకంగా ఉన్నాయి. గురువారం కర్నూలు మార్కెట్‌లో ఎండుమిర్చి క్వింటా గరిష్ఠ ధర 22,413 పలికింది. మినుములకు రూ.9451, కందులకు రూ.9,650, శనగలకు రూ.6,740 ప్రకారం గరిష్ఠ ధర లభించింది.

ఉద్యోగుల స్పందన రద్దు

కర్నూలు(సెంట్రల్): ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రతి మూడో శుక్రవారం నిర్వహించే స్పందన కార్యక్రమాన్ని అనివార్య కారణాలతో రద్దు చేసినట్లు జిల్లా రెవెన్యూ అధికారి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ విషయాన్ని ఉద్యోగులు గమనించాలని ఆయన పేర్కొన్నారు.

పౌరసరఫరాల అధికారిగా కేవీఎస్‌ఎం ప్రసాద్



జేసీ నారపురెడ్డి మౌర్యను మర్యాదపూర్వకంగా కలసిన ప్రసాద్

కర్నూలు(సెంట్రల్): కర్నూలు జిల్లా పౌరసరఫరాల అధికారిగా కేవీఎస్‌ఎం ప్రసాద్ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంతో ఆయన గురువారం సాయంత్రమే విధుల్లో చేరారు. ప్రస్తుతం ఇక్కడ ఇన్‌చార్జి డీఎస్‌ఓగా ఉన్న ఆచార్యుల స్థానంలో ఆయన బాధ్యతలు చేపట్టారు. ఈ క్రమంలో కర్నూలు డివిజన్ ఏఎస్‌ఓగా ఆచార్యులు వ్యవహరిస్తారు. కాగా, బాధ్యతలు చేపట్టిన పౌరసరఫరాల అధికారి కేవీఎస్‌ఎం జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్యను ఆమె కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు.

సివిల్స్ అర్హులకు 'జగనన్న ప్రోత్సాహకాలు'

కర్నూలు(అర్బన్): యూపీఎస్సీ నిర్వహించే ప్రిలిమ్స్, మెయిన్స్ పరీక్షల్లో అర్హత సాధించిన వెనుకబడిన వర్గాలు, ఆర్థికంగా బలహీనులైన వారికి 'జగనన్న సివిల్ సర్వీసెస్ ప్రోత్సాహకాలు ' పథకంలో భాగంగా నగదును అందించనున్నట్లు సాంఘిక సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్ జే రంగలక్ష్మిదేవి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సాంఘిక సంక్షేమ శాఖ డైరెక్టర్ విజయకృష్ణన్ జారీ చేసిన జీఓఎంఎస్ నెం: 58 ప్రకారం సామాజికంగా, ఆర్థికంగా, విద్యాపరంగా ఆయా వర్గాలను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం తాజాగా ఈ నగదును అందించేందుకు నిర్ణయం తీసుకుందన్నారు. ప్రిలిమ్స్‌లో అర్హత సాధించిన వారికి రూ. లక్ష, మెయిన్స్‌లో అర్హత సాధించిన వారికి రూ.50 వేలను ప్రభుత్వం అందజేయనుందన్నారు. 2023లో నిర్వహించిన యూపీఎస్సీ మెయిన్ పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులకు నగదు ప్రోత్సాహకం కింద రూ.50 వేలను అందించేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ఇందుకు సంబంధించి మెయిన్స్‌లో అర్హత సాధించిన అభ్యర్థులు jnanabhumi.ap.gov.in పోర్టల్‌లో అందించిన వెబ్ లింక్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు నమోదు చేసి ఈ నెల 19వ తేదీ లోగా పంపాలన్నారు.

వైఎస్సార్‌సీపీ అనుబంధ సంఘాల్లో జిల్లాకు చోటు

కర్నూలు(రాజ్‌విహార్): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అనుబంధ సంఘాల్లో కర్నూలు జిల్లాకు చెందిన పలువురు నాయకులకు చోటు దక్కింది. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం గురువారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర ముఖ్యమంత్రి, పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఈ నియామకాలు చేపట్టామన్నారు.

రాష్ట్ర బీసీ విభాగం: కర్నూలుకు చెందిన గొల్ల నాగరాజు యాదవ్(జోనల్ ఇన్‌చార్జి జోన్-7), దేవపూజ ధనుంజయ ఆచారి(ప్రధాన కార్యదర్శి), ఎస్.రామకృష్ణ(కార్యదర్శి), దగుడు ఖాంత్రి రాజశేఖర్, ఎస్.శ్రీరాములు(సంయుక్త కార్యదర్శులు).

క్రిస్టియన్ మైనార్టీ రాష్ట్ర కమిటీ: బి.జాన్ విల్సన్ పాల్(జోనల్ ఇన్‌చార్జి), పి.ఇ.సలోమి(కార్యదర్శి), ఎస్.జయకాంత్(సంయుక్త కార్యదర్శి).

రాష్ట్ర మైనార్టీ విభాగం: సయ్యద్ నూరుల్లా ఖాద్రి(ప్రధాన కార్యదర్శి), ఎస్.మహమ్మద్ ఇలియాస్(కార్యదర్శి).

రైతు విభాగం రాష్ట్ర కమిటీ: వంగాల భరత్ కుమార్ రెడ్డి(ఉపాధ్యక్షుడు), లింగా మల్లప్ప(జోనల్ ఇన్‌చార్జి జోన్-7), బి.నారాయణ నాయక్(ప్రధాన కార్యదర్శి), టి.శ్రీనివాసులు రెడ్డి(కార్యదర్శి), మల్లు సురేంద్రారెడ్డి, హెచ్.చంద్రకాంత్ రెడ్డి, భాస్కర్‌రెడ్డి, పోరెడ్డి వెంకటేశ్వర రెడ్డి(సంయుక్త కార్యదర్శులు).

రాష్ట్ర వాణిజ్య విభాగం: నగరూరి శ్రీనివాస్(కార్యదర్శి), సూరి రాజధార్ ఖాన్(సంయుక్త కార్యదర్శి).

రాష్ట్ర చేనేత విభాగం: జిందె లక్ష్మణ్(సంయుక్త కార్యదర్శి).



కర్నూలులో ర్యాలీకి భారీగా తరలివచ్చిన విద్యార్థులు

- కర్నూలు నగరంలో భారీ ర్యాలీ
- వేలాదిగా కదలి వచ్చిన విద్యార్థులు
- హోరెత్తిన జై జగన్ నినాదాలు
- మద్దతు తెలిపిన కర్నూలు ఎమ్మెల్యే, మేయర్

జగన్‌తోనే భవిత



జై జగన్ అంటూ నినదిస్తున్న విద్యార్థినులు



గాంధీ విగ్రహానికి పూల మాల వేస్తున్న ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్

కర్నూలు(సెంట్రల్): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వివిధ పథకాలు అమలు చేస్తూ విద్యార్థులకు చక్కటి భవిష్యత్తును అందిస్తున్నారని కర్నూలు నగర మేయర్ బీవై రామయ్య, ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ అన్నారు. విద్యార్థుల ఉన్నత చదువుకు భరోసా ఇస్తున్న వైఎస్ జగన్‌ను మళ్లీ సీఎం చేయాలని పిలుపునిచ్చారు. గురువారం కర్నూలులో వైఎస్‌ఆర్‌సీపీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు రెడ్డిపోగు ప్రశాంత్ ఆధ్వర్యంలో విద్యార్థి సాధికారత జగనన్నతోనే సాధ్యం అనే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజ్‌విహార్ సెంటర్ నుంచి కలెక్టరేట్ వరకు నిర్వహించిన ర్యాలీ విజయవంతమైంది. వేలాదిగా తరలివచ్చిన విద్యార్థులు ఫ్లెక్సీలు చేతబట్టి 'జై జగన్..జయహో జగన్' అంటూ నినాదాలతో హోరెత్తించారు. మళ్లీ సీఎంగా జగనన్న కావాలంటూ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమానికి మద్దతు తెలిపిన మేయర్ రామయ్య, ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్, విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు చైతన్య మాట్లాడుతూ.. దేశంలో ఎక్కడా లేని విధంగా పేద విద్యార్థుల చదువుకు భరోసా కల్పిస్తూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమ్మ ఒడి పథకం ద్వారా యేటా తల్లులకు రూ.15 వేలు ఇస్తున్నారన్నారు. జగనన్న విద్యా, వసతి దీవెన ద్వారా పూర్తి ఫీజురీయంబర్స్‌మెంట్‌తోపాటు హాస్టళ్లలో ఉండి చదువుకోవడానికి యేడాదికి రూ.20 వేలు మెస్ చార్జీలు ఇస్తున్నారన్నారు. ప్రపంచంలో టాప్-100 యూనివర్సిటీల్లో ఏపీకి చెందిన పేద విద్యార్థులు చదువుకోవడానికి జగనన్న విదేశీ విద్యా పథకాన్ని అమలు చేస్తున్నారన్నారు. రూ.65 లక్షల కోట్లతో నాడు-నేడు కింద 35 వేల ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చారన్నారు. యువతీ, యువకులకు లక్షలాది ఉద్యోగాలు ఇచ్చారని, స్కిల్ డెవలప్‌మెంట్‌లో శిక్షణ ఇప్పించి ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు అవకాశం కల్పించారన్నారు. వచ్చే ఎన్నికల్లో మరోసారి సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించాలని, ఆయన అధికారంలోకి వస్తే మరిన్ని సంక్షేమ పథకాలు అమలు చేస్తారన్నారు. చంద్రబాబునాయుడు, పవన్ కల్యాణ్ కార్పొరేట్, ప్రైవేట్ విద్యకు ప్రాధాన్యం ఇస్తారని, వారు అధికారంలోకి వస్తే పేద విద్యార్థులు చదువు మానుకోవాల్సిందేనన్నారు. విద్యార్థి సాధికారత ర్యాలీకి రాయలసీమ విద్యార్థి, యువజన సంఘాల జేఏసీ చైర్మన్ శ్రీరాములు, రాయలసీమ పరిరక్షణ సమితి నాయకులు రాజునాయుడు, ఓబులేసు,రియాజ్, జయరాజు మద్దతు తెలిపారు. వైఎస్‌ఆర్‌సీపీ విద్యార్థి విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు మణిరెడ్డి, కర్నూలు అసెంబ్లీ పరిశీలకుడు కర్రా హర్షవర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన కేంద్ర బృందం పర్యటన

కర్నూలు(అగ్రికల్చర్): ఉమ్మడి జిల్లాలో వర్షాభావంతో దెబ్బతిన్న పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు వచ్చిన ఇంటర్ మినిస్టీరియల్ సెంట్రల్ టీమ్ పర్యటన ముగిసింది. బుధవారం కర్నూలు జిల్లా పత్తికొండ, ఆస్పరి, ఆదోని, దేవనకొండ, కోడుమూరు మండలాల్లో కేంద్ర బృంద సభ్యులు పర్యటించి దెబ్బతిన్న పంటలను పరిశీలించడంతో పాటు రైతులతో ముఖాముఖి మాట్లాడారు. కలెక్టరేట్‌లో ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకించారు. బుధవారం రాత్రి తిరుమల వెళ్లిన సెంట్రల్ టీమ్ ప్రతినిధులు గురువారం సాయంత్రానికి నంద్యాల జిల్లా బేతంచెర్లకు చేరుకున్నారు. ఆర్‌ఎస్ రంగాపురంలో దెబ్బతిన్న పంటలను పరిశీలించడంతో పాటు రైతులతో మాట్లాడుతారు. దీంతో సెంట్రల్ టీమ్ పర్యటన ముగిసింది. వ్యవసాయ, ఉద్యాన శాఖ, పశుసంవర్ధకశాఖ, ఆర్‌డబ్ల్యూఎస్, నీటిపారుదల శాఖల అధికారులు తమ నివేదికలను సెంట్రల్ టీమ్ సభ్యులను అందజేశారు.

పశువులకు గ్రాసం ఇవ్వండి

బేతంచెర్ల: కరువు పరిస్థితుల నేపథ్యంలో పంటలు ఎండి నష్టపోయిన రైతులకు పరిహారంతో పాటు పశువులకు గ్రాసం ఇవ్వాలని కేంద్ర కరువు బృందానికి రైతులు మొరపెట్టుకున్నారు. జిల్లా డీఆర్వో పుల్లయ్య, జిల్లా వ్యవసాయశాఖ అధికారి మోహన్‌రావు ఆధ్వర్యంలో ఆర్‌ఎస్ రంగాపురం ఆర్బీకేల్లో రంగాపురం, అంబాపురం, బేతంచెర్ల, హెచ్.కొట్టాల రైతులతో పాటు పగిడ్యాల, మిడ్తూరు మండలాల రైతులతో కేంద్ర కరువు బృందం సభ్యులు ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌ఎస్ రంగాపురం గ్రామ సర్పంచ్ గుమ్మగాల్ల రాజు, రైతులు కృష్ణారెడ్డి, మధుశేఖర్ గౌడు, హుసేన్ బాషా, నాగేశ్వర్‌రెడ్డి, రాజేష్ కరువు పరిస్థితులను వివరించారు. కంది, పత్తి, మొక్కజొన్న, వేరుశనగ, ఆముదం, కొర్ర, జొన్న పంటలు వర్షాలు లేక దిగుబడి తగ్గిపోయాయని చెప్పారు. ఈ పరిస్థితుల్లో పశుగ్రాసం సరఫరా చేసి ఆదుకోవాలన్నారు. బేతంచెర్ల మండలానికి రూ. 11.12 కోట్ల నష్ట పరిహారం మంజూరు చేయాలని అధికారులు నివేదికలు అందజేశారు.

అభివృద్ధి ఫలాలు ప్రజలకందాలి

- మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి



కొచ్చెర్వు చెరువును పరిశీలిస్తున్న ఆర్థిక మంత్రి బుగ్గన

డోన్: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలు వినియోగించేలా చూడాలని అధికారులు, కాంట్రాక్టర్లకు ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి సూచించారు. గురువారం పట్టణ శివారులోని రూ.3 కోట్లతో నిర్మిస్తున్న టీటీడీ కల్యాణ మండపం నిర్మాణ పనులను పరిశీలించి కాంట్రాక్టర్‌పై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఏడాది క్రితమే నిధులు మంజూరైనా కూడా పనుల్లో పురోగతి లేకపోవడం పట్ల ఆయన అసహనం వ్యక్తం చేశారు. తన మంచితనాన్ని అసరాగా తీసుకొని పనుల్లో జాప్యం చేస్తే ఇకపై సహించేది లేదని హెచ్చరించారు. టీటీడీ అధికారులు పనులను పర్యవేక్షిస్తూ పూర్తి చేయించాలని ఆదేశించారు. అలాగే జగదుర్తి గ్రామం వద్ద సోలార్ ప్లాంట్ సమీపంలో అధికారులు సేకరించిన 36 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని ఆయన గురువారం మంత్రి పరిశీలించారు. ఈ స్థలంలో ఇండస్ట్రియల్ హబ్ ఏర్పాటు చేసి చిన్నతరహా పరిశ్రమల ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. ఇదే స్థలంలో కొంత భాగం ఆటో నగర్ ఏర్పాటు చేసే అవకాశాన్ని పరిశీలించి తనకు తగిన ప్రతిపాదనలు పంపాలని ఆయన ఏపీఐఐసీ జోనల్ అధికారి గంగాధర్‌ను ఆదేశించారు. ఎన్‌హెచ్ 44 నుంచి నేరుగా అప్రోచ్ రోడ్డు నిర్మించేందుకు ప్రతిపాదనలు పంపాలని తహసీల్దార్ విద్యాసాగర్‌కు సూచించారు. డోన్ మండలంలోని కొచ్చెర్వు, ఉడుములపాడు చెరువుల స్థిరీకరణ పనులను మంత్రి బుగ్గన పరిశీలించారు. హంద్రీనీవా కాల్వ ద్వారా నీటిని చెరువులను నింపే కార్యక్రమంపై ఆయన అధికారులతో ఆరాతీసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన వెంట డీఎస్పీ శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర మీట్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీరాములు, ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ రామచంద్రుడు, ఇరిగేషన్ అధికారులు ఉన్నారు.

విద్యుత్ పొదుపు అందరి బాధ్యత



వాల్ పోస్టర్‌ను విడుదల చేస్తున్న దృశ్యం

కర్నూలు(రాజ్‌విహార్): విద్యుత్ పొదుపు అందరి బాధ్యత అని జిల్లా జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య అన్నారు. గురువారం స్థానిక కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో ఆమె జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాల వాల్ పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నిత్యావసరాల జాబితాలో విద్యుత్ ఉందని అన్నారు. రోజురోజుకీ విద్యుత్ వినియోగం పెరుగుతోందని, భవిష్యత్తులో లోటు, కొరత సమస్యను నివారించేందుకు పొదుపుగా వాడుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా విద్యుత్ ఎస్‌ఈ ఎం.ఉమాపతి, కర్నూలు టౌన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఓబులేసు, టౌన్-1, 2, ఆపరేషన్స్ డీఈఈలు రాజమోహన్ రెడ్డి, రాజేంద్రబాబు, వై.సుబ్బన్న, కమర్షియల్ ఈఈ విజయభాస్కర్ పాల్గొన్నారు.

'ఆడుదాం- ఆంధ్ర' రిజిస్ట్రేషన్లను వేగవంతం చేయాలి

ఆడుదాం- ఆంధ్ర క్రీడలకు సంబంధించి క్రీడాకారుల ఎంపికకు సంబంధించిన రిజిస్ట్రేషన్లను వేగవంతం చేయాలని అధికారులను జేసీనారపురెడ్డి మౌర్య ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ నుంచి ఆమె వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మండల స్థాయి అధికారులతో సమీక్షించారు. ఆడుదాం- ఆంధ్రకు సంబంధించి శనివారం నాటికి క్రీడా ప్రాంగణాల ఎంపిక పూర్తయ్యేలా చూడాలన్నారు. క్రీడల్లో మహిళా క్రీడాకారులు పాల్గొనేలా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. వికసిత్ భారత్ సంకల్ప్ యాత్రను నిర్వహించే గ్రామాల్లో ముందుగానే దండోరా వేయించి ప్రజలకు తెలియజేసేలా ఎంపీడీఓలు చర్యలు తీసుకోవాలన్నారు. అబాదీ రీసర్వేకు సంబంధించి గూడూరు, ఎమ్మిగనూరులకు సంబంధించి ఆర్‌ఓఆర్‌లు వచ్చాయని, వాటిని క్షేత్ర స్థాయిలో పరిశీలన చేయించాలన్నారు. గ్రౌండ్ ట్రూతింగ్ అయిన వెంటనే 9(2) నోటీసులు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో డీఆర్వో కె.మధుసూదన్‌రావు, జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి పాల్గొన్నారు.

ముచ్చుమర్రి, మల్యాల నుంచి కేసీకి సాగునీరు

జూపాడుబంగ్లా: ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకం మూడు మోటార్లు, మల్యాల ఓ మోటారు ద్వారా కేసీ కాల్వకు 1,080 క్యూసెక్కుల సాగునీటిని సరఫరా చేస్తున్నట్లు కేసీ కాల్వ ఏఈ శ్రీనివాసనాయక్ తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సుంకేసుల డ్యాం నుంచి కేసీ కాల్వకు సాగునీటి సరఫరా నిలిచిపోవటంతో ముచ్చుమర్రి, మల్యాల ఎత్తిపోతల పథకాల ద్వారా కేసీ కాల్వకు సాగునీటిని సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. ఈ నీటిని లాకిన్స్‌లా నుంచి నిప్పులవాగుకు 112 క్యూసెక్కులు, తూడిచెర్ల సబ్ చానల్ కాల్వకు 600 క్యూసెక్కుల సాగునీటిని సరఫరా చేస్తున్నట్లు తెలిపారు.

తుంగభద్ర దిగువ కాలువకు 25 వరకు నీటి విడుదల

హొళగుంద: తుంగభద్ర దిగువ కాలువ(ఎల్లెల్సీ)కు ఈ నెల 25 వరకు నీటి విడుదల కొనసాగనుంది. కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం చొరవతో జలవనరుల శాఖ ఎస్ఈ రెడ్డి శేఖర్‌రెడ్డి ఈ మేరకు టీబీ బోర్డు అధికారులకు లేఖ రాశారు. కర్ణాటక రైతు సంఘం నాయకుల డిమాండ్ మేరకు ఈ నెల 15వ తేదీ వరకు ఎల్లెల్సీలో నీటిని కొనసాగించేందుకు టీబీ బోర్డు అధికారులు నిర్ణయం తీసుకున్నారు. అయితే జిల్లా అధికారుల కోరిక మేరకు ఈ నెల 25 వరకు కొనసాగిస్తూ 450 క్యూసెక్కుల మేర నీటిని వదలనున్నారు. ప్రస్తుతం టీబీ డ్యాంలో 11.5 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

చేసిన మేలును వివరించేందుకే బస్సు యాత్ర

- ఇది సీఎం జగన్ ప్రతిష్టాత్మకంగా తీసుకున్న కార్యక్రమం
- జయప్రదం చేయాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్తపై ఉంది
- 17న కర్నూలులో నిర్వహించేందుకు ఏర్పాట్లు
- వైఎస్సార్‌సీపీ రీజనల్ కో ఆర్డినేటర్ రామసుబ్బారెడ్డి



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ రీజనల్ కో ఆర్డినేటర్ రామసుబ్బారెడ్డి



హాజరైన పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు

కర్నూలు (రాజ్‌విహార్): బడుగు, బలహీన వర్గాల వారికి చేసిన మేలును వివరించేందుకే సామాజిక సాధికార బస్సు యాత్ర నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కర్నూలు రీజనల్ కోఆర్డినేటర్ రామసుబ్బారెడ్డి తెలిపారు. గురువారం సాయంత్రం నగరంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలను గత ప్రభుత్వాలు కేవలం ఓటు బ్యాంకు కోసమే వాడుకున్నాయన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబు ఎన్నికలు వచ్చిన ప్రతిసారీ బీసీ కార్డు చూపించి ..సాధ్యం కాని హామీలు ఇస్తూ మోసం చేస్తున్నారన్నారు. మహానేత మరణం తర్వాత పేదల కోసం వైఎస్సార్‌సీపీని స్థాపించారని చెప్పారు. పార్టీలో బడుగు, బలహీన వర్గాలకు సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అధిక ప్రాధాన్యతనిచ్చారన్నారు. ప్రభుత్వం ఏర్పడ్డాక పదవులు కూడా ఇచ్చారన్నారు. దీంతో అణగారిన వర్గాలు సైతం నేడు తలెత్తుకుని తిరిగే పరిస్థితులు నెలకొన్నాయన్నారు. ఈ నేపథ్యంలో చేసిన మేలును వివరించేందుకు బస్సు యాత్రను నిర్వహిస్తున్నామని, ఇది సీఎం జగన్ ప్రతిష్టాత్మకంగా తీసుకున్న కార్యక్రమమని పేర్కొన్నారు. కర్నూలులో ఈనెల 17వ తేదీన నిర్వహించనున్న సామాజిక సాధికార బస్సు యాత్రను జయప్రదం చేయాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్తపై ఉందన్నారు. అనంతరం పార్టీ జిల్లా అధ్యక్షుడు బీవై రామయ్య మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు అత్యధికంగా పదవులు ఇచ్చి గుర్తింపు తెచ్చిన ఏకైక నాయకుడు సీఎం జగన్ అన్నారు. గతంలో అబద్ధాలతో చంద్రబాబు ఆయా వర్గాలను మోసం చేశారన్నారు. బస్సు యాత్రకు ఆయా వర్గాలు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. అనంతరం కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్ మాట్లాడుతూ.. నాడు ఓటు బ్యాంకు రాజకీయాలకే పరిమితమైన బడుగు, బలహీన వర్గాల నాయకులకు పదవులు రావడంతో నేడు లీడర్లుగా గుర్తింపు తెచ్చుకున్నారన్నారు. కష్టపడి పనిచేసిన ప్రతి ఒక్కరినీ పార్టీ గుర్తుంచుకుంటుందని చెప్పారు. మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి, కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ విజయ మనోహరి మాట్లాడుతూ సమష్టిగా బస్సు యాత్రను జయప్రదం చేయాల్సిన అవసరం ఉందన్నారు. బడుగు, బలహీన, మైనార్టీ వర్గాలకు సీఎం జగన్ అనేక పదవులు ఇచ్చి వారికి సమాజంలో గుర్తింపు తెచ్చారని పార్టీ నాయకుడు అహ్మద్ అలీ ఖాన్ అన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుభాష్ చంద్రబోస్ మాట్లాడుతూ.. సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వంలో మాత్రమే అన్ని సామాజిక వర్గాలకు న్యాయం జరిగిందన్నారు. అణగారిన వర్గాలకు 50 శాతానికి పైగా పదవులు ఇవ్వాలని చట్టం చేసి అమలు చేసిన నాయకుడు సీఎం జగన్ అని నగర అధ్యక్షురాలు సత్యనారాయణమ్మ అన్నారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర నాయకులు సీహెచ్ మద్దయ్య మాట్లాడుతూ బస్సు యాత్రకు ఎస్సీ, ఎస్టీ, మైనారీలు అధికంగా తరలిరావాలన్నారు. సమావేశంలో పార్టీ నియోజకవర్గ పరిశీలకుడు కర్రా హర్షవర్ధన్‌రెడ్డి, నాయకులు ఆదిమోహన్‌రెడ్డి, కేదార్‌నాథ్, ప్రసాద్, కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సంక్షేమ బావుటా

పేదల ప్రభుత్వమిది



నేను, నా భర్త విజయ్‌కుమార్ కూలి పనులు చేసుకుని జీవనం చేస్తున్నాం. మేము 20 ఏళ్లుగా అద్దె ఇంట్లో కాపురం ఉంటున్నాం. టీడీపీ హయాంలో ఇంటి కోసం, స్థలం కోసం ఎన్ని సార్లు దరఖాస్తు చేసినా మాకు రాలేదు. ఇంటి అద్దెను కట్టుకోలేక అవస్థలు పడ్డాం. కనీసం స్థలమైనా వస్తే చాలనుకున్నాం. జగనన్న ప్రభుత్వం వచ్చిన తరువాత స్థలం కావాలని ఎవరినీ అడగలేదు. వాలంటీర్ మా ఇంటికి వచ్చి దరఖాస్తు చేయించారు. జగనన్న కాలనీలో సెంటు స్థలం వచ్చింది. మొదట కొంతమందికి ఇళ్లు కడుతున్నారు. మాకు రెండో విడతలో వస్తుందని చెప్పారు. చాలా సంతోషంగా ఉంది. మాకు ముగ్గురు పిల్లలు. అమ్మఒడి పథకం ద్వారా ఏటా రూ.15,000 వస్తోంది. ఇది పేదల ప్రభుత్వం. ఈ ప్రభుత్వమే మళ్లీ రావాలి.

– రేణుకబాయి, వైఎస్‌అర్ కాలనీ, ఆదోని

వైఎస్సార్ చేయూతతో చీరల వ్యాపారం



నా భర్త షేక్ షరీఫ్ తాపీ మేస్త్రి. ఆయన ఒక్కరే తెచ్చిన సంపాదనతో కుటుంబం గడవడం కష్టంగా ఉండేది. ప్రభుత్వం చేయూత పథకం కింద ఆర్థిక సాయం చేయడంతో మా కాలనీలోనే చీరల వ్యాపారం ప్రారంభించా. వైఎస్సార్ చేయూత కింద ఏటా రూ.18,750 చొప్పున మూడేళ్లలో రూ.56,250 తీసుకున్నా. ఈ డబ్బు తిరిగి చెల్లించాల్సిన అవసరం లేకపోవడంతో చీరల కొనుగోలుకు బాగా ఉపయోగపడింది. నాల్గవ విడత డబ్బు కూడా త్వరలోనే నా ఖాతాకు జమ అవుతుందంట. చీరల వ్యాపారంతో నెలకు రూ.5 వేల వరకు సంపాదించుకుంటున్నా.

– షేక్ ఖతియాబీ, గీతానగర్, కర్నూలు

క్లుప్తంగా

ఏఎస్‌ఐ కుటుంబానికి ఆర్థిక సాయం

బొమ్మలసత్రం: సంజామల పోలీస్‌స్టేషన్‌లో పని చేస్తూ కొంత కాలం క్రితం అనారోగ్యంతో మృతి చెందిన ఏఎస్‌ఐ గంగన్న కుటుంబానికి ఎస్పీ రఘువీర్‌రెడ్డి గురువారం ఆర్థిక సహాయం అందజేశారు. స్థానిక ఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఏఎస్‌ఐ గంగన్న భార్య లక్ష్మీ నారాయణమ్మకు విడోఫండ్ కింద రూ. 50 వేలు, ఫ్లాగ్ ఫండ్ రూ. 25 వేలను ఎస్పీ అందించారు. సిబ్బంది సమస్యల పరిష్కారానికి ముందుంటామని ఎస్పీ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఐ శ్రీనివాసులు, ఏవో నిజాముద్దీన్ ఆర్‌ఎస్‌ఐ వీరన్న పాల్గొన్నారు.

ఉబికి వచ్చిన గంగమ్మ



పొలంలో బోరు వేయగా ఉబికి వస్తున్న గంగమ్మ

గడివేముల: ఓ రైతు పొలంలో బోరు వేస్తుండగా గంగమ్మ పైకి ఉబికి వచ్చింది. గడివేముల ప్రాంతంలో సాధారణంగా 500 నుంచి 600 అడుగుల లోతు వేస్తేగాని నీటి జాడ దొరకదు. అయితే బుధవారం గడివేముల గ్రామానికి చెందిన రవీంద్రారెడ్డి పొలంలో కేవలం 450 అడుగులు లోతులోనే ఐదు ఇంచుల సామర్థ్యంలో గంగమ్మ ఉబికి వచ్చింది. దీంతో ఈ ప్రాంతాల రైతులు ఆశ్చర్యం వ్యక్తం చేశారు. నిరంతరంగా ఉబికి వస్తున్న నీటిని చూసేందుకు సమీప గ్రామాల ప్రజలు ఆసక్తి చూపారు.

హత్య కేసులో నిందితుల అరెస్ట్

కోడుమూరు రూరల్: కోడుమూరులో ఈనెల 10వ తేదీ రాత్రి రవి (24) హత్యకు గురికాగా, ఈ కేసులో నిందితుల అరెస్ట్ చేసినట్లు సీఐ మన్సురుద్దీన్ గురువారం విలేకరులకు తెలిపారు. సీఐ తెలిపిన వివరాల మేరకు.. రవికి, శివకృష్ణ, శివ, పిప్పల రాము, పిక్కిలి అశోక్‌ల మధ్య మనస్పర్ధలు ఉండేవి. ఈనెల 10వతేదీ ఆదివారం శివకృష్ణ, శివ కోడుమూరు పాత బస్టాండ్ సెంటర్‌లో రోడ్డు దాటుతుండగా రవి, సాయి కుమార్‌లు వేగంగా మోటార్ సైకిల్ నడుపుతూ వెళ్లారు. శివకృష్ణ బిగ్గరగా వారి వైపు చూడడంతో రవి కొట్టాడు. దీంతో ఆవేశానికి లోనైన శివకృష్ణ ఇంటికి వెళ్లి కత్తిని తెచ్చుకున్నాడు. రాము, బోయ అశోక్, మరో మైనర్ బాలుడు రవితో గొడవపడతుండగా..శివకృష్ణ వెంట తెచ్చుకున్న కత్తితో రవి వరబీజాల దగ్గర పొడిచాడు. తీవ్రంగా గాయపడిన రవిని స్నేహితులు ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. హత్య కేసు నమోదు చేసిన కోడుమూరు, గూడూరు ఎస్‌ఐలు శ్రీనివాసులు, పీరయ్యలు రెండు బృందాలుగా ఏర్పడి గురువారం మండలంలోని ప్యాలకుర్తి రోడ్డులో ఉన్న నిందితులు శివకృష్ణ, పిప్పల రాము, పిక్కిలి అశోక్‌లను అరెస్ట్ చేసినట్లు సీఐ మన్సురుద్దీన్ తెలిపారు. హత్య కేసును చేధించడంతో పాటు నిందితులను త్వరగా పట్టుకునేలా కృషి చేసిన ఎస్‌ఐలు శ్రీనివాసులు, పీరయ్య, సిబ్బంది రాముడు, వీరన్న, రమేష్, రామకృష్ణ, బాషాలను సీఐ అభినందించారు.

పాదరక్ష.. బతుకు దీక్ష



చర్మకారులు	
నంద్యాల జిల్లా	కర్నూలు జిల్లా
2,439	1,153

ఒకప్పుడు కొత్త చెప్పులు కుట్టించుకోవడం సంపన్న కుటుంబాలకే పరిమితం. ఇందులో కూడా చర్మకారుల నేర్పరితనం కాళ్లకు హుందాతనం తీసుకొచ్చేది. సినిమాల ప్రభావంతో కిర్రు చెప్పులు తెరపైకి రాగా.. రాజకీయ నాయకులు, మంచి హోదాలో ఉన్న వాళ్లు వీటి పట్ల ఆకర్షితులయ్యారు. ఉన్న ఊళ్లలోనే వీటిని తయారు చేస్తుండగా.. మండల, జిల్లా కేంద్రాల్లో కొందరు కుల వృత్తికి మెరుగులు దిద్ది ఆదాయ వనరుగా మార్చుకున్నారు. కాలక్రమంలో చెప్పుల తయారీ పరిశ్రమగా మారడంతో ఈ వృత్తినే నమ్ముకున్న ఎన్నో కుటుంబాల జీవనం దుర్భరంగా మారింది. అయితే కొందరు ఇప్పటికీ రోడ్ల పక్కనే చిన్న బంకులు ఏర్పాటు చేసుకొని చెప్పులు కుడుతూ, పాలిష్ చేస్తూ వచ్చిన అరకొర డబ్బుతోనే సంతృప్తి చెందుతున్నారు. – సాక్షి, కర్నూలు డెస్క్

కె.శ్రీనివాసులు, కె.సుగుణ దంపతులు పాత ఆర్టీఓ కార్యాలయం సమీపంలో ఓ చిన్న బంకు ఏర్పాటు చేసుకొని కులవృత్తిని కొనసాగిస్తున్నారు. సుమారు 25 సంవత్సరాలుగా ఇక్కడే వీళ్లు చెప్పులు కుడుతున్నారు. రోజంతా కష్టపడితే వచ్చే రూ.500–రూ.700 డబ్బుతో వీరి కుటుంబం గడుస్తుంది. ఇద్దరు కూతుళ్ల సంతానం కాగా, పెద్ద కుమార్తె ఏఎన్‌ఎం కోర్సు పూర్తి చేసింది. చిన్నమ్మాయి 8వ తరగతి చదవుతోంది. షోరూంలు ఏర్పాటయ్యాక బతుకు దుర్భరంగా మారినా, నమ్ముకున్న వృత్తి కడుపు నింపుతోందని అభిప్రాయపడ్డారు.



ఈమె పేరు నాగరత్నమ్మ. పుట్టుకతోనే దివ్యాంగురాలు. తల్లిదండ్రులు చిన్నతనంలోనే చనిపోగా.. అనంతపురం నుంచి వచ్చి కర్నూలులో స్థిరపడింది. జాన్ అనే వ్యక్తి వద్ద చెప్పులు కుట్టడం నేర్చుకొని జీవనోపాధిగా మార్చుకుంది. మార్కెట్‌యార్డు ఎదురుగా ఓ బంకులో ఈమె తన బతుకుబండి లాగిస్తోంది. వచ్చిన అరకొర డబ్బుతోనే ఈమె తనతో పాటు కుమార్తెను పోషిస్తోంది. ఒకప్పుడు బాగానే ఉన్నా.. ఇప్పుడు వంద రూపాయల చెప్పులు రావడంతో వాడి పడేస్తున్నారని, కుట్టించుకునే వాళ్లు కానీ.. పాలిష్ చేయించుకునేందుకు కూడా చాలా తక్కువగా వస్తున్నారని చెబుతోంది.

కడుపు నింపుతున్న కులవృత్తి

- ఒకప్పుడు చెప్పుల తయారీతోనే ఉపాధి
- ఇప్పుడు మరమ్మతులకే పరిమితం
- షూ మార్ట్‌ల రాకతో మారిన బతుకు చిత్రం
- రెడీమేడ్‌ల మాటున ఉపాధి కోల్పోయిన చర్మకారులు
- రోడ్డు పక్కన భారంగా జీవనం

గతంలో ఎలాంటి వారైనా చెప్పులను తమ కాళ్లకు అనుగుణంగా కుట్టించుకునే వాళ్లు. గ్రామాల్లో తమ ఇంటి వద్దకే పిలిపించుకొని సైజులను ఇచ్చి ఇలా కుట్టాలని చెబితే చాలు.. వారం పది రోజుల్లో సిద్ధమైపోయేవి. ఇందుకు అప్పట్లో డబ్బులు ఇవ్వడం చాలా అరుదు. ఒకపూట భోజనం పెట్టడమో, లేకపోతే గింజలు వేయడంతో సరిపెట్టేవాళ్లు. ఇప్పుడు చెప్పులను కుట్టించుకునే వాళ్లు చాలా అరుదుగా మాత్రమే ఉంటున్నారు. ఈ కారణంగానే కుల వృత్తి కనుమరుగవుతూ వచ్చింది. పల్లెటూళ్లలో ఇప్పుడు కూడా ఒకరిద్దరు తమ వృత్తిని కొనసాగిస్తూ అందులోనే సంతోషం వెతుక్కుంటున్నారు.

పెరిగిన ధరలతో ఉపాధి కరువు

కర్నూలు నగరంలో ఒకప్పుడు 60కి పైగా కుటుంబాలు చెప్పులు కుట్టి ఉపాధి పొందుతుండగా.. ఇప్పుడు 30 కుటుంబాలు మాత్రమే ఈ వృత్తిని కొనసాగిస్తున్నాయి. గతంలో చెప్పులు కుట్టించుకునేందుకు పోటీ పడుతుండగా.. ఇప్పుడు ఆ పరిస్థితి లేకపోవడంతో ఈ వృత్తిని కొనసాగించే వారి సంఖ్య కూడా తగ్గుతోంది. చెప్పుల తయారీకి అవసరమైన సామగ్రి ధరలు పెరిగిపోవడం, ఆ స్థాయిలో ధర చెల్లించేందుకు ఎవరూ ఇష్టపడటం లేదని తెలుస్తోంది. ఈ కారణంగా రెడీమేడ్ చెప్పులను కొనుగోలు చేసి బంకుల్లో విక్రయానికి ఉంచుతున్నారు. వీటి ధర రూ.100 నుంచి రూ.250 వరకు మాత్రమమే ఉంటోంది.



కర్నూలు మార్కెట్ యార్డు రహదారిలో షూ పాలీష్ చేస్తున్న చర్మకారుడు

షూ మార్ట్‌ల రాకతో మారిన బతుకు చిత్రం

చెప్పుల తయారీ చర్మకారుల వరకే పరిమితమైనన్ని రోజులు ఆ కుటుంబాలకు కొంత ఉపాధి లభించింది. 1995 నుంచి పరిస్థితిలో మార్పు వచ్చింది. చెప్పుల తయారీ పరిశ్రమగా మారుతూ రావడంతో ఈ వృత్తినే నమ్ముకున్న వాళ్ల ఉపాధికి గండి పడింది. షూ మార్టుల రాకతో పాటు బడా కంపెనీలు రంగప్రవేశం చేయడంతో ఎక్కడికక్కడ అద్దాల షోకేస్‌లలో చెప్పులు, బూట్లు మెరిసిపోవడం మొదలైంది. అంతా రెడీమేడ్ తయారీ కావడం, మనసుకు నచ్చిన రకాలు ఉండటం.. ధర కూడా అందుబాటులో ఉండటంతో చేతి వృత్తికి ఆదరణ తగ్గిపోయింది. వీరు తయారు చేసిన చెప్పుల ధర అధికంగా ఉండటం, కంపెనీల నుంచి వచ్చే చెప్పుల ధర తక్కువగా ఉండటంతో అందరి అడుగులు కార్పొరేట్ వైపే మళ్లాయి.



ఇంత రేటా అనే నిట్టూర్పు

కొన్ని కుటుంబాలు ఇప్పటికీ ఇదే వృత్తినే నమ్ముకొని జీవనం సాగిస్తున్నాయి. జిల్లా కేంద్రం కర్నూలు విషయానికొస్తే రాధాకృష్ణ టాకీసు వద్ద చెప్పులు కుట్టే దుకాణం ప్రతి ఒక్కరికీ సుపరిచితమే. అదేవిధంగా మాధవనగర్, ఫైవ్ రోడ్ సర్కిల్, పెద్దాసుపత్రి, కృష్ణానగర్.. ఇలా కొన్ని కూడళ్లలో మాత్రమే చర్మకారులు ఇప్పటికీ కులవృత్తినే నమ్ముకొని జీవనం సాగిస్తున్నారు.

వేసుకున్నామా.. పడేశామా..

30 ఏళ్ల వెనక్కు వెళ్తే.. కుట్టించుకున్న చెప్పులు సుమారు ఏడాది కాలమైనా రావాల్సిందే. రబ్బరు చెప్పులకు రంధ్రాలు పడినా నడక అలాగే సాగేది. ఉంగటం ఊడిపోతే కింద పిన్నీసు పెట్టి ముందుకు కదిలేవాళ్లు. ఇంకొందరు చర్మకారుల వద్ద సరిచేయించుకుని హమ్మయ్యా ఇంకొన్ని రోజులు పని జరుగుతుందనుకునేవాళ్లు. ఇంక బూట్లు వేసుకునే వాళ్లు చర్మకారుల వద్ద పాలిష్ చేయించుకుని మురిసిపోయేవాళ్లు. ఇప్పుడు ఆ పరిస్థితి మారిపోయింది. కొనుగోలు చేస్తున్న చెప్పులు ఒకటి రెండు నెలలు వాడితే గగనమే. వేసుకున్నామా, పడేశామా అన్నట్లుగా తయారైంది. ఇక పాలిష్ అంటే.. ఇంట్లోనే చేసుకోవడం పరిపాటిగా మారింది.

అద్దాల భవంతుల్లో చెప్పిన ధర ఇచ్చి చెప్పులు కొనుగోలు చేసే వాళ్లు.. వాటికి మరమ్మతు చేయించే సమయంలో రోడ్డు పక్కన చర్మకారులతో బేరమాడటం విస్మయాన్ని కలిగిస్తోంది. వేల రూపాయలు పెట్టి కొనుగోలుకు వెనుకాడని వాళ్లు.. ఇక్కడికొచ్చి రూ.10–20 రూపాయలకు ఇంత రేటా అని నిట్టూరుస్తుండటం గమనార్హం.

కులవృత్తి కుటుంబానికి ఆసరా



తాతల కాలం నుంచి వస్తున్న కులవృత్తి కుటుంబానికి ఆసరాగా నిలుస్తోంది. చెప్పులు కుట్టుకుంటూనే ముగ్గురు పిల్లలను వాళ్ల కాళ్లపై నిలబడేలా చేశా. బతికినంతకాలం ఈ వృత్తిని కొనసాగిస్తా. కాలం ఎంత మారినా చేతి వృత్తులను నమ్ముకుంటే ఉపాధికి కొదవ లేదు. సుమారు 20 ఏళ్లగా ఇదే పని చేస్తున్నా. చాలా సంతోషంగా ఉన్నాం. – అరదేశి జయరాముడు, చర్మకారుడు, కోవెలకుంట్ల

నేటి నుంచి ఏఐకేఎస్ జాతీయ కౌన్సిల్ సమావేశాలు

- హాజరు కానున్న ఏఐకేఎస్ అధ్యక్ష, కార్యదర్శులు అశోక్ ధవాలే, విజూకృష్ణన్



జాతీయ కౌన్సిల్ సభలు విజయవంతం కోసం ప్రచారం నిర్వహిస్తున్న ఏఐకేస్ నాయకులు

కర్నూలు(సెంట్రల్): ఆల్ ఇండియా కిసాన్ సభ(ఏఐకేఎస్) జాతీయ కౌన్సిల్ సమావేశాలు శుక్రవారం నుంచి మూడు రోజులపాటు కర్నూలులో జరగనున్నాయి. ఈ సమావేశాలకు ముఖ్య అతిథులుగా ఏఐకేఎస్ అధ్యక్ష, కార్యదర్శులు అశోక్ ధవాలే, విజూకృష్ణన్ హాజరుకానున్నారు. సమావేశాలకు ఆహ్వాన సంఘం ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తి చేశారు. మొదటి రోజు శుక్రవారం కర్నూలు కొత్త బస్టాండ్‌కు సమీపంలోని శంకరయ్య నగర్‌లో జెండా ఆవిష్కరణతో కౌన్సిల్ సమావేశాలు ప్రారంభమవుతాయి. మధ్యాహ్నం 3 గంటలకు సుందర్యసర్కిల్ నుంచి పాతబస్టాండ్‌లోని అంబేద్కర్ విగ్రహం వరకు భారీ ర్యాలీ, అనంతరం బహిరంగ సభ నిర్వహిస్తారు. డిసెంబర్ 16,17 తేదీల్లో ప్రతినిధుల సభలు ఉంటాయి. కాగా.. కర్నూలులో మొట్ట మొదటి సారిగా అఖిల భారత స్థాయిలో ఏఐకేఎస్ సమావేశాలను నిర్వహిస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ మృతి

కల్లూరు: ఉలిందకొండ పోలీస్‌స్టేషన్ పరిధిలోని 44వ జాతీయ రహదారి నాయకల్లు ఫ్లై ఓవర్ బ్రిడ్జి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ మృతి చెందాడు. బెంగళూరుకు చెందిన బాల కార్తికేయ రాజన్ (27) మైక్రోసాఫ్ట్ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పని చేస్తుండేవాడు. డిసెంబర్ 4న బెంగళూరు నుంచి హైదరాబాద్‌కు బదిలీ అయ్యారు. హైదరాబాదులో విధుల్లో చేరేందుకు తల్లితో కలసి బయలుదేరాడు. మార్గమధ్యంలో 44వ జాతీయ రహదారి నాయకల్లు ఫ్లై ఓవర్ బ్రిడ్జి వద్ద ముందు వెళ్తున్న పాల వ్యాను ఉన్నట్టుండి వేగం తగ్గించడంతో కారును అదుపు చేసుకోలేక వ్యాను వెనుకభాగంలో ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో బాల కార్తికేయ రాజన్‌కు బలమైన గాయమయ్యింది. తల్లికి కుడిచేతి మణికట్టు వద్ద రక్తగాయాలయ్యాయి. 108లో నగరంలోని కిమ్స్ హాస్పిటల్‌కు తరలించారు. అయితే కోలుకోలేక బుధవారం రాత్రి బాల కార్తికేయ రాజన్ మృతిచెందాడు. మృతుని తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు గురువారం ఉలిందకొండ పోలీసులు కేసు నమోదు చేశారు.

విద్యార్థుల ప్రదర్శన ప్రశంసనీయం

- స్కీమ్స్ అండ్ సర్వీసెస్ అసిస్టెంట్ డైరెక్టర్ శామ్యూల్ పాల్



విజేతలకు మెమొంటో అందజేస్తున్న శామ్యూల్ పాల్

ఓర్వకల్లు: మోడల్ స్కూల్ విద్యార్థులు ప్రదర్శించిన వినూత్న ప్రాజెక్టులు ప్రశంసనీయమని స్కీమ్స్ అండ్ సర్వీసెస్ అసిస్టెంట్ డైరెక్టర్ శామ్యూల్ పాల్ అన్నారు. గురువారం స్థానిక ఏపీ మోడల్ స్కూల్‌లో 'టింకర్ ఫెస్ట్' కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రిన్సిపాల్ జోషుల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి శామ్యూల్‌తో పాటు, ఎంఈఓ ఓంకార్‌యాదవ్, టింకర్ ఫెస్ట్ మెంటార్ ఫయాజ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా శామ్యూల్ పాల్ మాట్లాడుతూ ఉత్తమ అటల్ ల్యాబ్‌గా వరుసగా మూడవ సారి ఏపీ మోడల్ స్కూల్ ఎంపిక కావడం విశేషమన్నారు. విద్యార్థులను సైన్స్ అండ్ టెక్నాలజీ ప్రాజెక్టులు రూపొందించే విధంగా తయారు చేసిన ప్రిన్సిపాల్ జోషుల, అటల్ ల్యాబ్ ఇన్‌చార్జిని అభినందించారు. విద్యార్థులు నైపుణ్యతతో రూపొందించిన ప్రాజెక్టులు ఆకర్షణీయంగా వున్నాయన్నారు. అనంతరం విజేతలకు మెడల్స్, మెమొంటోలతో పాటు, ప్రశంసాపత్రాలను అందజేశారు.

రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీల విజేత కర్నూలు



జాతీయ స్థాయి క్రికెట్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

నంద్యాల(న్యూటౌన్): 67వ రాష్ట్రస్థాయి అండర్–14 బాలుర క్రికెట్ పోటీల్లో కర్నూలు జట్టు విజేతగా నిలిచింది. స్థానిక ఎస్పీజీ క్రీడా మైదానంలో నిర్వహిస్తున్న క్రికెట్ పోటీల్లో భాగంగా గురువారం ఫైనల్ మ్యాచ్ హోరాహోరీగా సాగింది. కర్నూలు, విశాఖ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో కర్నూలు జట్టు క్రీడాకారులు సత్తా చాటుతూ విజయం సాధించారు. ద్వితీయ స్థానాన్ని విశాఖపట్నం, తృతీయ స్థానాన్ని అనంతపురం కైవసం చేసుకుంది. అనంతరం విజేతలకు ఎస్‌డీఆర్ పాఠశాల మేనేజింగ్ డైరెక్టర్ ఎస్.కొండారెడ్డి ట్రోఫీ, మెమొంటోలు అందజేశారు. ఈ సందర్భంగా స్కూల్ గేమ్ ఫెడరేషన్ నంద్యాల జిల్లా కార్యదర్శి శివకుమార్, స్టేట్ అబ్జర్వర్ దిలీప్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు పెద్ద పీట వేస్తుందన్నారు. ఆడుదాం ఆంధ్ర పోటీల్లో క్రీడాకారులు ప్రతిభా చాటాలన్నారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తే స్పోర్ట్స్ కోటా కింద ఉద్యోగ అవకాశాలు మెరుగుపడతాయన్నారు. కార్యక్రమంలో ఏపీ పీఈటీ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బత్తుల రవికుమార్, ప్రభాకర్ పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక

రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ చాటిన ఆయా జిల్లాల జట్ల నుంచి క్రీడాకారులను జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ఉమ్మడి కర్నూలు జిల్లా నుంచి నలుగురు క్రీడాకారులు ఎంపిక కావడం విశేషం. జనవరి నెలలో కేరళ రాష్ట్రం త్రివేండ్రంలో జరిగే జాతీయ స్థాయి స్కూల్ గేమ్ క్రికెట్ పోటీల్లో రాష్ట్ర జట్టు పాల్గొననుంది.

ఎంపికైన క్రీడాకారులు.. సాయిరిషి (కర్నూలు), రేవంత్ (తూర్పు గోదావరి), కిరణ్ కుమార్ (అనంతపురం), రేవంత్ వర్మ (వైజాగ్), రుత్విక్ కల్యాణ్ (కర్నూలు), సూర్యతేజ్ (కడప), చరణ్‌తేజ్ (విజయనగరం), జాయ్‌స్మిత్ (శ్రీకాకుళం), పాల్ సుదర్శన్ (కర్నూలు), సాయి తేజ (కృష్ణ), రంగ రామానుజన్ (వైజాగ్), తన్మయ్ (అనంతపురం), హరిహరణ్(కర్నూలు), వైతీష్ చంద్ర(వైజాగ్), భాను (వైజాగ్), తాహీర్ (కడప).

అంతర్ కళాశాలల అథ్లెటిక్స్ పోటీలు ప్రారంభం





వంద మీటర్ల పరుగు పందెంలో పోటీ పడుతున్న అథ్లెట్లు, షాట్‌పుట్ విసురుతున్న క్రీడాకారుడు

కర్నూలు (టౌన్): రాయలసీమ యూనివర్సిటీలో గురువారం వర్సిటీ స్థాయి అంతర్ కళాశాలల అథ్లెటిక్స్ పోటీలు ప్రారంభమయ్యాయి. పోటీలను వర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ పీఎఫ్ రెహ్మాన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. అందివచ్చిన అవకాశాలను వినియోగించుకొని రాణించాలన్నారు. కార్యక్రమంలో రెక్టార్ ప్రొఫెసర్ సీవీ క్రిష్ణారెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సుందరానంద పుచ్ఛ, వర్సిటీ స్పోర్ట్స్ డైరెక్టర్ శివకిషోర్ పాల్గొన్నారు.

విజేతలు వీరే..

- 100 మీటర్ల పరుగు పందెం పురుషుల విభాగంలో డి. ప్రవీణ్‌కుమార్, ఎస్. నబీసాహెబ్, వై.బ్రహ్మా, మహిళల విభాగంలో బి. రాజేశ్వరి, సి. అనూష , బి. నందిని మొదటి మూడు స్థానాల్లో నిలిచారు.
- 1500 మీటర్ల పరుగు పందెం పురుషుల విభాగంలో కె.సుదర్శన్, వై. వెంకట సునీల్, ఆర్. సాయిక్రిష్ణ సింగ్, మహిళల విభాగంలో సి. కల్పన, ఎం. నాగేంద్రమ్మ, కె. శ్రీవాణి.. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారు.
- షాట్ పుట్ పురుషుల విభాగంలో ఎస్. సమీర్, ఎస్. మహబూబ్ బాషా, హరిష్, మహిళల విభాగంలో సి. గాయత్రి, జి. మంజుల, పి.జుబేదా, జావిలిన్ త్రో పురుషుల విభాగంలో ఎం. విజయ్‌రాజ్, జి.కిరణ్‌కుమార్, ఎస్. మహబూబ్‌బాషా, మహిళల విభాగంలో బి. దివ్య, కె. శ్రీ రాఘవి , యమున మొదటి మూడు స్థానాలు కైవసం చేసుకున్నారు.